# 4

## మూల వాక్యము: నిర్గమకాండము 12:1-30

# పాత నిబంధనలో ముందుగా సూచింపబడెను

వివిధమైన పాత నిబంధన ఆచారములు క్రొత్త నిబంధన ఆచారములను ముందుగానే సూచించినవి. ఇవి నూతన నిబంధన వాస్తవాలను తెలుపు "ప్రతిరూపాలు" (*tupos*), నూతన నిబంధన వాస్తవాలను "నిజరూపాలని" (*antitupos*) పిలిచారు.

ఆదాము, యేసు యొక్క ప్రతిరూపం "type" (రోమీయులకు 5:14) అందువలన యేసు నిజరూపం ("antitype"). నోవహు ఓడలో నీటి ద్వారా రక్షించబడుట బాప్తిస్మమునకు ఒక గురుతు:

> ... [దేవుని దీర్ఘశాంతము] ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైనవారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మలయొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణపొందిరి. దానికి సాదృశ్యమైన *antitupos* బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది ... (1 పేతురు 3:20, 21; NKJV).

నీటిద్వార ఓడలోని వారి భౌతికమైన రక్షణ ఒక ఛాయ (ప్రతిరూపం) మన ఆత్మ సంబధమైన బాప్తిస్మము ద్వారా, రక్షణకు ఒక వాస్తవికత (దుష్టాంతము) అది ఇప్పుడు మనలను రక్షించుచున్నది. దానివైపు చూచి ఇశ్రాయేలీయులు బ్రతుకుటకు ఎత్తబడిన సర్పము యేసు యొక్క ప్రతిరూపం, మనకు నిత్య జీవము కలుగునట్లు ఆయన ఎత్తబడెను (యోహాను 3:14, 15).

నీడ ఉండుటకు చెట్టు ముందుగా తప్పనిసరిగా ఉండాలి. దీనికి విరుద్ధముగా, పాత నిబంధన గురుతులు లేదా ఛాయలు ముందుగా వచ్చెను, తర్వాత క్రొత్త నిబంధన దృష్టాంతములు, వాస్తవికతలు, వాటిని నెరవేర్చెను. పాత నిబంధనలోని ప్రతిరూపాలు సాధారణముగా క్రొత్త నిబంధనలోని ఆత్మ సంబంధమైన వాస్తవాలకు ప్రతినిధిత్వం కలిగిస్తున్నాయి (రోమీయులకు 2:29; 7:6; 2 కొరింథీయులకు 3:6).

యూదుల వివిధ నియమాలలో, జ్ఞాపకార్థములలో ప్రత్యేకించి పస్కాపండుగ; బలులు; నిబంధనలలో, మరియు రాజ్యపు భోజనములలో ప్రభువు రాత్రి భోజనము ముందుగా చిత్రీకరించ బడియుండుట కన్పిస్తుంది.

### జ్ఞాపకార్థములు

గొప్ప సంఘటనలను ప్రజలు గుర్తుచేసుకొనేందుకు దేవుడు పాత నిబంధనలోని స్మారక చిహ్నములను ఉపయోగించాడు.

> స్మారక చిహ్నము లేదా జ్ఞాపకార్థముల ఉద్దేశము బహు విలువగల వ్యక్తులు మరియు సంగతులను భద్రపరచుట మరియు స్థిరపరచుట లేదా శాశ్వతముగా జ్ఞాపకం ఉండేటట్టు చేయుట.

ప్రతి స్మారకము ఏదో ఒక దానిని జ్ఞాపకముచేస్తుంది. లేనట్లైతే అది దాని గుర్తింపును కోల్పోయి విలువలేకుండా పోతుంది. జ్ఞాపకార్థము లేదా స్మారక చిహ్నము దాని గుణమును. అసాధారణమైన వ్యక్తుల సంగతుల లేదా వస్తువుల జ్ఞాపకానికి గుణమై ఉంటుంది.[1]

పాత నిబంధనలో ఈ క్రింది ఉదాహరణలు స్మారకములు లేదా జ్ఞాపకార్థములుగా ఉండియున్నవి:

- దేవుడు మేఘములలో ఇంద్ర ధనుస్సునుంచినప్పుడు, ఇక ఎప్పటికి జల ప్రళయమును భూమి మీదకి రప్పించెను అని చెప్పాడు (ఆదికాండము 9:13–17). ఇంద్ర ధనస్సు మానవులందరితో చేసిన దేవుని నిబంధనను గుర్తుచేస్తుంది.
- ప్రతివారము, ఏడవ దినమున సబ్బాతు విశ్రాంతిని గైకొనవలెనని దేవుడు ఇశ్రాయేలీయులకు దయచేసి యున్నాడు (నిర్గమకాండము 20:10; ద్వితీయోపదేశకాండము 5:14). ఐగుప్తు బానిసత్వం నుండి దేవుడు వారిని విడిపించిన సంగతిని వారు మనస్సులో ఉంచుకొన వలసియుండెను.
- ఇశ్రాయేలీయుల ఏ ద్వారబందములు రక్తముతో గుర్తు వేయబడెనో ఆ ఇండ్లలోని జ్యేష్ఠ పుత్రులను సంహరింపకుండ దాటి పోయిన ఆ రాత్రిని జ్ఞాపకము చేసికొనుటకు పస్కా పండుగను దేవుడు దయచేసియున్నాడు. వారు పస్కాను భుజించునప్పుడు, వారు ఐగుప్తు బానిసత్వమునుండి విడుదలపొందినప్పటి చుట్టునున్న సంఘటనలను జ్ఞాపకము చేసుకోవాలి.
- దేవుడు ఇశ్రాయేలీయులను యొర్దాను నది దాటించిన సంగతికి జ్ఞాపకార్థముగా యెహోషువతో నున్న పన్నెండుమంది ఒక్కొక్కరు ఒక్కోక్క రాతిని నదిలో నుండి తీసుకొనవలెను. దేవుడు నిబంధన మందసము మోయు యాజకుల ద్వారా నది ప్రవాహమును ఎలా ఆపాడో వారి పిల్లలకు చెప్పుటకు ఇది ఒక గురుతుగా ఉండెను (యెహోషువ 3:11–4:7).

పాత నిబంధనలో జ్ఞాపకార్థ చిహ్నములు ముఖ్యమైన సంఘటనలను జనులకు జ్ఞప్తిచేయుటకు సహాయపడెను. "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని" (1 కొరింథీయులకు 11:24; చూడు 25 వచనం) అని చెప్పి, యేసు ప్రభువు రాత్రి భోజనమును స్థాపించెను.

### బలులు

ధర్మశాస్త్రపు బలులు, నీడలవలె యేసు యొక్క బలిని ముందుగా సూచించాయి.

> ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలదికాదు గనుక ఆ యాజకులు ఏటేట ఎడతెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చువారికి ఎన్నడును సంపూర్ణసిద్ధి కలుగజేయ నేరవు (హెబ్రీయులకు 10:1).

ధర్మశాస్త్రము క్రింద, బలులు అర్పించబడునప్పుడు పాపులు వారి పాపములను జ్ఞాపకముచేసుకునేవారు, "అయితే ఆ బలులు అర్పించుటచేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి" (హెబ్రీయులకు 10:3). మనము ప్రభువు రాత్రి భోజనమును ఆచరించుట ద్వారా మనకు అదే వాస్తవమైయున్నది. మన పాపములు తీసివేయుటకు వాటిని

జ్ఞప్తికి తెచ్చుకొని యేసు బలిమీద మన లక్ష్యాన్ని ఉంచుతాము (మత్తయి 26:26-28; 1 కొరింథీయులకు 11:23-25).

## నిబంధన

మొదటి నిబంధనను, పది ఆజ్ఞలతో పాటు, ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచిన కొద్ది కాలంలోనే దేవుడు వారితో చేశాడు. దేవునిచే వ్రాయబడిన పది ఆజ్ఞలు గల పలకలును మోషే నిబంధన మందసములో ఉంచాడు.

ఇశ్రాయేలీయుల పాపములకు మొదటి నిబంధన పరిపూర్ణమైన కనికరము మరియు క్షమాపణ అనుగ్రహించలేదు కనుక దానిని చేయగల మరొక దానిని దాని స్థలములో దేవుడు ప్రవేశపెట్టాడు (హెబ్రీయులకు 8:7, 8, 12, 13). యిర్మీయ ఈలాగు ప్రవచించెను,

> ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యిపట్టుకొని – దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు (యిర్మీయా 31:31, 32ఎ).

క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసు (హెబ్రీయులకు 12:24), "రెండవ దానిని స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టివేయుచున్నాడు" (హెబ్రీయులకు 10:9).

నిబంధనలు రెండు రక్తముతో అర్పించబడినవి (నిర్గమకాండము 24:5-8; హెబ్రీయులకు 9:18-20). జంతువుల రక్తము, యేసు రక్తమును ముందుగా సూచించెను, ఆ రక్తము కృప మరియు క్షమాపణయైన క్రొత్త నిబంధనను స్థాపించెను (మత్తయి 26:28). ఎవరు క్రీస్తుకు విధేయులై ఉంటారో వారి పాపములును క్షమించుటకు ఈ నిబంధనలో దేవుడు అంగీకరించెను. ఆయన మన పాపములను యేసు రక్తమువలన పరిహరించి మరి ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనడు (హెబ్రీయులకు 8:12).

## రాజ్యపు భోజనము

రాజుగా బల్ల దగ్గర ఇతరులతో కలసి భోజనము చేయుట గొప్ప ఆధిక్యముగా పరిగణింపబడుతుంది. దావీదు మెఫీబోషెతుకు అతని బల్లయొద్ద భుజించే ఏర్పాటు చేశాడు. (2 సమూయేలు 9:6-10). దావీదు అబ్షాలోమునుండి దూరముగా పారిపోయినప్పుడు బర్జిల్లయి కుమారులు చేసిన సహాయమునకు వారిని తన బల్లయొద్ద భుజించుటకు వారిని అనుమతించుమని సొలొమోనుకు దావీదు మనవి చేశాడు (1 రాజులు 2:7). పెక్కుమంది సొలొమోను బల్లయొద్ద గౌరవించబడిరి (చూడు 1 రాజులు 4:27) బబులోను రాజైన ఎవీల్మెరోదకు యెహోయాకీనును బందీగృహము నుండి రప్పించి ఆయన సన్నిధిని భోజనముచేయుట ద్వారా అతనిని గౌరవించెను (2 రాజులు 25:29; యిర్మీయా 52:33).

ప్రభువు బల్ల యొద్ద రొట్టెను తినుట, ద్రాక్షారసము త్రాగుటకు కూడా ఒక గౌరవము. ఒక చోట చేరి సహ పౌరులతో కలిసి రాజ్యపు భోజనములో పాలుపొందుట ద్వారా (చూడు ఫిలిప్పీయులకు 3:20) యేసు మనకొరకు బాధనొందుటను జ్ఞాపకము చేసుకొంటారు. ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనుటకు యేసు బల్లయొద్ద చేరినవారు గొప్పగా ఆశీర్వదింప బడినవారు. ఎందుకనగా మనము ఆయనతో అన్యోన్య సహవాసము చేయుటకు ఆధిక్యము

గలవారము గనుక (మత్తయి 26:29; లూకా 22:30; మార్కు 14:25; 1 కొరింథీయులకు 10:21).

## సారాంశము

పాత నిబంధనలోని ఆచారములు క్రొత్త నిబంధన వాస్తవాలకు ఛాయా రూపములు. వాటిలో కొన్ని ప్రభువు రాత్రి భోజనమును ముందుగా సూచించుతున్నాయి. ఇవి దీని అర్థము మరియు ఉద్దేశమును అవగాహన చేసికొని గ్రహించుటకు మనకు సహాయపడతాయి.

---

సూచన

[1]Guy B. Funderburk, “Memorial, Memory,” *The Zondervan Pictorial Encyclopedia of the Bible,* ed. Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1975), 4:179.

## పస్కాపండుగ, ఒక ప్రతిరూపం

ప్రభువు రాత్రి భోజనమును పస్కాపండుగతో అనేక విధములుగా పోల్చవచ్చును. ఈ క్రింది పోలికలు మరియు భేదములును ఆలోచించుదాము.

**పోలికలు**

| *పస్కా పండుగ* | *ప్రభువు రాత్రి భోజనము* |
|---|---|
| సమాజముగా కూడి జనులు దీనిని భుజిస్తారు (నిర్గమకాండము 12:3, 4). | ఒక కూడికలో రొట్టెను తిని ద్రాక్ష రసమును త్రాగుదురు (1 కొరింథీయులకు 11:33). |
| ఇది దేవుని ప్రేమను వ్యక్తపరుచుటకై ఉండెను (హోషేయ 11:1). | ఇది ప్రేమను వ్యక్త పరచుటకు ఉన్నది (చూడు ప్రకటన 1:5). |
| ఇది లోపములేని బలి అర్పణకు సంబంధించినది (నిర్గమకాండము 12:5). | యేసు లోపము లేనివాడైయుండెను (2 కొరింథీయులకు 5:21; హెబ్రీయులకు 4:15; 1 పేతురు 1:19). |
| ఒక మగ జంతువు వధించబడెను (నిర్గమకాండము 12:5). | యేసు, ఒక పురుషుడు వధింపబడెను (మత్తయి 1:21, 25). |
| రక్తము ద్వారా జీవము నిచ్చుటకు మరణము సంభవించెను (నిర్గమకాండము 12:7, 13). | రక్తము ద్వారా జీవము నిచ్చుటకు యేసు మరణము సంభవించెను (యోహాను 6:54; చూడు రోమీయులకు 5:10). |
| ఇది నిర్ణయించబడిన ఒక దినాన ఆచరింపబడేది (నిర్గమకాండము 12:6; సంఖ్యాకాండము 9:2–5). | ఇది నిర్ణయించబడిన ఒక దినాన ఆచరించబడుతుంది (అపొస్తలుల కార్యములు 20:7). |
| పండుగలో పులియని రొట్టె భుజింపబడేది (నిర్గమకాండము 12:8). | పులియని రొట్టె భుజింపబడుతుంది (1 కొరింథీయులకు 5:8). |
| విడుదల లేదా విమోచనకు రక్తము చిందింపబడేది (నిర్గమకాండము 12:13). | పాప క్షమాపణ కొరకు రక్తము చిందింపబడును (మత్తయి 26:28). |
| జ్యేష్ఠులను మరణమునుండి రక్షించుటకు రక్తము చిందింపబడేది (నిర్గమకాండము 12:12, 13). | జ్యేష్ఠుల సంఘము కొరకు రక్తము అర్పించబడెను (హెబ్రీయులకు 12:23; అపొస్తులుల కార్యములు 20:28). |
| ఇది దేవుడు ఏమి చేసెనో దానికి జ్ఞాపకార్థముగా భుజింపబడేది (నిర్గమకాండము 12:14). | యేసు బలిని జ్ఞాపకము చేసికొనుట జరుగుతుంది (1 కొరింథీయులకు 11:24, 25). |
| ఇది మరల మరల జ్ఞాపకముచేసికొనుటకు ఆచరింపబడేది (నిర్గమకాండము 12:14, 17, 24). | ఇది నిరంతర జ్ఞాపకార్థమై ఉన్నది (1 కొరింథీయులకు 11:26). |
| గొఱ్ఱపిల్ల మరొకరిచే బలి అర్పించబడేది (నిర్గమకాండము 12:21–23). | గొఱ్ఱెపిల్ల మరొకరిచే బలి అర్పించబడెను (అపొస్తులుల కార్యములు 2:23). |
| ఇది దేవుని ప్రజలచే గైకొనబడేది సున్నతి చేయబడనివాడు దీనిని భుజింప కూడదు (నిర్గమకాండము 12:42–48). | ఇది ఆత్మసంబంధమైన సున్నతి చేయబడిన సంఘమునకు నియమించబడెను (కొలొస్సయులకు 2:11–13). |
| బలి అర్పించునప్పుడు ఎముకలు విరువబడేవి కాదు (నిర్గమకాండము 12:46). | యేసు మరణించినప్పుడు ఆయన ఎముకలు విరువబడలేదు (యోహాను 19:32, 33). |

**తేడాలు**

| *పస్కా పండుగ* | *ప్రభువు రాత్రి భోజనము* |
|---|---|
| ఇది భౌతికమైన కుటుంబాల కొరకు నియమించబడెను (నిర్గమకాండము 12:3). | ఇది ఆత్మసంబంధమైన కుటుంబము కొరకు నియమించబడెను (1 కొరింథీయులకు 10:17 చూడు). |
| కుటుంబమునకు ఒకటి చొప్పున చాలా గొఱ్ఱెలు వదింపబడేవి (నిర్గమకాండము 12:3). | ఒకే ఒక మరణము సంభవించెను (హెబ్రీయులకు 7:27; 9:24–28; 10:10, 12, 14). |
| దేవుని ప్రజలచే ద్వారా బందముల మీద గొఱ్ఱెపిల్ల రక్తము పూయబడెను (నిర్గమకాండము 12:7, 21, 22). | అన్య దేశస్థుడైన, ఒక రోమా సైనికునిచే యేసు రక్తము చిందించబడెను (యోహాను 19:34). |
| ఒక గొఱ్ఱెపిల్లను వధించి సాయంకాలమునకు ఏమియు మిగలకుండ తినేవారు (నిర్గమకాండము 12:8–10). | యేసు, దేవుని గొఱ్ఱెపిల్ల (యోహాను 1:29), వదింపబడెను మరియు రొట్టెను తినుటలో మరల మరల ఆయన వచ్చువరకు జ్ఞాపకము చేయబడుతుంది (1 కొరింథీయులకు 11:23–25). |

| | |
|---|---|
| ఇది దేవుడు ఏమి చేశాడో దాని కోసం వెనుకకు చూపబడేది (నిర్గమకాండము 12:14). | ఇది రెంటిని యేసు మరణమునకు వెనుకకు మరియు ఆయన రాకడకు ముందుకు చూపుస్తుంది (1 కొరింథీయులకు 11:23-26). |
| పండగ దినాలలో మొదటి, చివరి దినాలలో ఏ పని చేయకూడదు (నిర్గమకాండము 12:16; ద్వితీయోపదేశకాండము 16:8). | పనిని ఆపవలిసిన అవసరము లేదు. |
| జ్యేష్ఠులను దేవుడు సంహరింపకుండుటకు గొఱ్ఱెపిల్ల రక్తము దేవుని కొరకు చిందింపబడేది (నిర్గమకాండము 12:12, 13, 23). | యేసు రక్తము పాపములను క్షమించి క్రొత్త నిబంధనను ప్రతిష్ఠించెను (మత్తయి 26:28). |
| గొఱ్ఱెపిల్ల మరణము గాక, దేవుని చర్య జ్ఞాపకము చేయబడేది (నిర్గమకాండము 12:42). | యేసు మరియు ఆయన మరణము జ్ఞాపకము చేయబడతాయి (1 కొరింథీయులకు 11:23-26). |
| దేవుడు నిశ్చయించిన ఒక స్థలములో ఇది ఆచరించబడేది (ద్వితీయోపదేశకాండము 16:5, 6). | ప్రత్యేకమైన ఎన్నిక స్థలమేమి లేదు (యోహాను 4:21). |
| ఒక వారముపాటు సంవత్సరమునకు ఒకసారి అది ఆచరించబడును (ద్వితీయోపదేశకాండము 16:1, 8). | ఇది వారములో మొదటి దినాన అనగా ఆదివారమున ఆచరింపబడుతుంది (అపొస్తులుల కార్యములు 20:7). |

ఇశ్రాయేలీయులకు పస్కా పండుగను ఇచ్చుట ద్వారా ప్రభువు రాత్రి భోజనమును దేవుడు ముందుగా సూచించాడు. యేసు, మన పస్కా బలిగా వదించబడెనని పౌలు వ్రాశాడు (1 కొరింథీయులకు 5:7). ఈ విధముగా రెండు పండుగల మధ్య గుర్తింపును దేవుడు సూచించాడు.